

నేవీ ఆయుధ డిపో ఏర్పాటును విరమించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకవారిగూడెంలో నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటును విరమించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు రెండు వేల కోట్ల రూపాయాల అంచనా వ్యయంతో ఏజెన్సీ ప్రాంతంలో 1,166 ఎకరాల్లో నేవీ ఆయుధ డిపో పరిశ్రమను ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడ నిర్ణయాలతో గత మూడేళ్లుగా దొంగ సర్వేలు చేస్తూనే ఉన్నాయని తెలిపారు. స్థానిక గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా మూర్ఖంగా దొంగ సర్వేలు చేస్తూ ఈ ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయని పేర్కొన్నారు. మూడుసార్లు గ్రామసభలు ఏర్పాటు చేసినా పంచాయతీ ప్రజలు ముక్తకంఠంతో తిప్పి కొట్టారని తెలిపారు. ఇటీవల ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రాజెక్ట్ నిర్మాణంపై పునరాలోచిస్తున్నట్లు తెలపడం అభినందనీయమని పేర్కొన్నారు. పునరాలోచించడం కాదని, పూర్తిగా విరమించుకోవాలని తెలిపారు.

'ఫెంగల్' పరేషాన్..!

తుపాను ప్రభావంతో చిరుజల్లులు, మబ్బులు

రెండు జిల్లాల్లో నాలుగులక్షల ఎకరాల్లో వరిసాగు

ఇప్పటి వరకూ లక్షా 83 వేల ఎకరాల్లో కోతలు పూర్తి

2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఇంకా కళ్లాల్లో 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం

వర్షం కొనసాగితే తీవ్ర ఇబ్బందులే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఫెంగల్ తుపాను ప్రభావం అన్నదాత గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. శనివారం నుంచి వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. తుపాను తీరం దాటినప్పటికీ మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శనివారం నుంచి జిల్లాలో పడుతున్న చిరుజల్లులు, మబ్బులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండురోజుల వరకూ కోతలు కోయొద్దంటూ అధికారుల సూచనలతో రైతులు వెనక్కి తగ్గిన పరిస్థితి. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు శ్రమిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో లక్షా 93 వేల ఎకరాలు, పశ్చిమగోదావరిలో 2.05 లక్షల ఎకరాలు మొత్తం దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఉంగుటూరు వంటి మండలాల్లో దాదాపు 80 శాతం వరకూ మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాలకుగాను లక్షా 15 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో 68,117 ఎకరాల్లో కోతలు పూర్తవ్వడంతో రెండు జిల్లాల్లో లక్షా 83 వేల ఎకరాల్లో ఖరీఫ్ మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. ఇప్పటి వరకూ పశ్చిమలో లక్షా 45 వేల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో లక్షా 51 వేల మెట్రిక్ టన్నులు మొత్తంగా 2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. మరో పది రోజుల్లో మాసూళ్లు దాదాపు పూర్తయ్యే అవకాశం ఉండగా ఫెంగల్ తుపానుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ధాన్యం తడిస్తే ఇబ్బందులే..

కోతలు పూర్తయ్యి రైతులు ఆరబెడుతున్న ధాన్యం ఇంకా ఏలూరు జిల్లాల్లో ఎనిమిది వేల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరిలో ఆరు వేల మెట్రిక్ టన్నుల వరకూ ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. చిరుజల్లులకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. టార్పలిన్లు, బరకాలు వేసి కాపాడుకుంటున్నారు. ఇప్పటి వరకూ పరిస్థితి బాగానే ఉందని, వర్షం పెరిగితే మాత్రం ఇబ్బందులు తప్పవని రైతులు చెబుతున్నారు. ధాన్యం తడిస్తే మాత్రం రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడనుంది. వర్షాలు కురిసినా ఇబ్బందుల్లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో టార్పలిన్లు అందించాలి. వర్షం కురిస్తే తేమ పేరుతో మిల్లర్లు ధరలో కోతలు పెట్టి అడ్డంగా దోచుకునే పరిస్థితి రానుంది. గతంలో రెండు జిల్లాల్లో తేమ పేరుతో దోపిడీ అత్యంత దారుణంగా సాగింది. మిల్లుకు చేరుకున్న లారీలను తేమ పేరుతో ఆపేసి ఆన్‌లైన్ ద్వారా సొమ్ము వేయించుకుని దిగుమతి చేసుకున్న పరిస్థితి నడిచింది. దీంతో అప్పటి పరిస్థితులను రైతులు గుర్తుచేసుకుంటున్నారు. వాతావరణం సహకరించిన తర్వాతే కోతలు కోయాలని రైతులు భావిస్తున్నారు. మిల్లర్లు కొత్త సమస్యలు తీసుకురాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమవారం నుంచి వాతావరణం కొంత మెరుగయ్యే అవకాశం ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల మార్పుతో ఖరీఫ్ మాసూళ్లు ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. రెండు జిల్లాల్లో రైతులు రబీ నారుమడులు సైతం వేస్తున్నారు. తుపాను ప్రభావంతో నారుమడులు వేసేందుకు రైతులు వెనుకాడుతున్నారు. దీంతో రబీ నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.



ఆచంట వేమవరం పార్వతి చెరువులో నేలకొరిగిన చేలు

యథేచ్ఛగా పోలవరం గట్టున తవ్వకాలు

కంసాలిగుంటలో జెసిబి, లారీ సీజ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

పోలవరం కాలువ గట్టున ఉన్న కంకర గుట్టలను మట్టి మాఫియా రాజకీయ నాయకుల అండదండలతో రేయింబవళ్లు యథేచ్ఛగా తవ్వేస్తోందని సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు. శనివారం రాత్రి ఉంగుటూరు మండలం కంసాలిగుంట వద్ద కంకర తవ్వకాలపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారి యు.రాంబాబు దాడి చేసి జెసిబి, లారీని స్వాధీనం చేసుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. విఆర్ఒ నివేదిక మేరకు మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు డిటి పూర్ణచంద్రప్రసాద్ ప్రజాశక్తికి వెల్లడించారు.



కంసాలిగుంట వద్ద కంకర తోలకాలు

అందరి దృష్టి పోలవరం కాలువ గట్టుపైనే

ఎలాంటి కంకర అవసరాలకైనా అందరి దృష్టి పోలవరం కాలువపైనే పెడుతున్నారు. ముఖ్యంగా ఇటీవల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో గ్రావెల్‌ను లైసెన్స్ క్వారీల నుంచి కొనుగోలు చేసి వినియోగించాల్సిన కాంట్రాక్టర్లు అడ్డదారులు తొక్కుతూ పోలవరం గట్టును రాత్రివేళల్లో తవ్వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో కంకరగుట్టలు కనుమరుగై గట్టుకు సైతం ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆదివారం కంసాలిగుంట వద్ద కంకర అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. దీనిపై స్థానికులు ఫొటోలు తీసి అధికారులకు పంపడంతో ట్రాక్టర్లతో అక్రమార్కులు అక్కడ నుంచి తప్పించుకుపోయారు. మట్టి మాఫియా కొన్ని ప్రాంతాల్లో పోలవరం గట్టును తవ్వేసి అందులో నాసిరకం మట్టితో పూడ్చేసి అధిక లాభాలు గడిస్తుండటం గమనార్హం.



అధికారులు సీజ్ చేసిన జెసిబి

నిఘా లోపానికి సిబ్బంది కొరతే కారణం

పోలవరం కాలువ ఎఇ బాపూజీ

పోలవరం కాలువ గట్టు వెంబడి కంకర తవ్వకాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతూనే ఉన్నాం. ముఖ్యంగా అర్ధరాత్రులు తవ్వకాలపై సిబ్బంది కొరత కారణంగా సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోవడంలో ఆలస్యమవుతోంది. పోలవరం కాలువ గట్టును పరివాహక గ్రామస్తులు, రైతులే రక్షించుకునేలా కృషి చేయాలి. అక్రమ తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకుని మాకు అప్పగిస్తే కేసులు నమోదు చేయిస్తున్నాం.

పథకాల అమలుకు చిత్తశుద్ధితో కృషి

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల హక్కుల రక్షణ కోసం, ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాల అమలు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి సహాయం అందిస్తున్నారు, వృద్ధుల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, ఈ సంవత్సరం ఎంతమందికి ఉపకరణాలు అందించారు వంటి పలు ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ముఖ్య లక్ష్యం ఏమిటి?

ఎడి: ప్రభుత్వం వారికి అందిస్తున్న అన్ని రకాల సహాయ సహకారాలు, ఉపకరణాలు అందించడంతోపాటు వృద్ధులకు చట్టపరమైన రక్షణ కల్పించడం, సమాజంలో వారు గౌరవంగా బతికేలా చర్యలు తీసుకోవడం వంటివి ఈ శాఖ ముఖ్యోద్దేశం.

ప్రశ్న: విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి ఉపకరణాలు అందిస్తున్నారు, ఈ సంవత్సరం ఎంతమందికి అందించారు?

ఎడి: విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్‌ఛైర్స్, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలు అందిస్తాం. ఈ సంవత్సరం ఇంకా పంపిణీ చేయాల్సి ఉంది. అలాగే వయోవృద్ధులకు చేతి కర్రలు అందిస్తాం. వచ్చే జనవరి నుంచి ప్రతి నియోజకవర్గంలో అలింకో క్యాంపులు నిర్వహించి వారి అవసరాలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వయోవృద్ధుల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఎడి: వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'బ్రింగ్ యువర్ గ్రాండ్ పేరెంట్స్ టు స్కూల్' అనే కార్యక్రమం చేపట్టాం. విద్యార్థులు వారి తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలను పాఠశాలకు తీసు కురావడం, వారికి పాఠశాల చూపించడం, కొన్ని ఆటలు ఆడించటం, పిల్లలు వృద్ధులు కలిపి ఆటలు ఆడటం వంటి కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి ఆరు నెలలకు కమిటీ మీటింగ్ నిర్వహించి వయోవృద్ధుల సమస్యలపై చర్చించడం జరుగుతుంది. ప్రతి నాలుగో శనివారం వయోవృద్ధుల సంక్షేమ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి, వృద్ధుల అవసరాలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇస్తున్నాం.



ప్రశ్న: హిజ్రాల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎడి: హిజ్రాలు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. ఆ గుర్తింపు కార్డు ద్వారా ప్రతినెలా వారు రూ.నాలుగు వేలు పెన్షన్ పొందొచ్చు.

ప్రశ్న: సమాజంలో హిజ్రాలపై చిన్నచూపు ఉన్న నేపథ్యంలో వారు ఉద్యోగాల కంటే భిక్షాటనకే మొగ్గు చూపుతున్నారు. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

ఎడి: హిజ్రాలకు భిక్షాటన కన్నా వ్యాపారం, వృత్తి, ఉద్యోగం గౌరవంగా ఉంటుంది అని తెలిసేలా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాం. అంతేకాక వారికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించి బ్యూటీషియన్, టైలరింగ్, విస్తరాకుల తయారీ వంటి రకరకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. హిజ్రాలు గ్రూపుగా ఏర్పడి ముందుకొస్తే శిక్షణ ఇస్తాం.



ప్రశ్న: పిల్లల నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులకు, వయోవృద్ధులకు ఈ శాఖ ద్వారా ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారు?

ఎడి: సీనియర్ సిటిజన్ పోషణ సంరక్షణ చట్టం ద్వారా ఎవరైనా పిల్లల నిరాదరణకు గురైతే వారు మాకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఆర్‌డిఒ కోర్టులో కేసు నమోదు చేస్తాం. అలాంటి పిల్లల నేరం రుజువైతే జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే తల్లిదండ్రుల పోషణ నిమిత్తం రూ.పది వేలు దాటకుండా మెయింటినెన్స్ ఖర్చులు ఇప్పించే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆ తల్లిదండ్రులు సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి న్యాయం చేస్తాం.

ప్రశ్న: కొంతమంది తమ తల్లిదండ్రుల వద్ద నుంచి ఆస్తులు రాయించుకుని తల్లిదండ్రులను బయటకు నెట్టేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అలాంటివారికి ఏమైనా రక్షణ కల్పించే అవకాశం ఉందా?

ఎడి: తల్లిదండ్రులు గిఫ్టుగా పిల్లలకు ఆస్తులు రాసిన తర్వాత వారు పిల్లల నిరాదరణకు గురైతే సీనియర్ సిటిజన్స్ చట్టం సెక్షన్ 23 ప్రకారం వారికి ఆ రిజిస్ట్రేషన్ రద్దుచేసి, ఆస్తులను తిరిగి ఇప్పిస్తాం.

ప్రశ్న: ఈ నెల మూడో తేదీ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

ఎడి: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఇప్పటికే జిల్లాస్థాయిలో వికలాంగులకు క్రీడా పోటీలు నిర్వహించాం. విజేతలకు మంగళవారం బహుమతులు అందిస్తాం. అలాగే ఆరోజు వారి అవసరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రైతులు అధైర్యపడొద్దు

జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలను మరో రెండు రోజులపాటు వాయిదా వేసుకోవాలని, రైతులు ఎవరూ అధైర్యపడొద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌భాషా అన్నారు. మండలంలోని వడాలి, అప్పారావుపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి హబీబ్‌భాషా మాట్లాడుతూ రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, 18 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని రైస్‌మిల్లుల యాజమాన్యం తీసుకునేలా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు కేంద్రాల ద్వారా సమీపంలోని రైస్‌మిల్లులకు తరలించుకోవాలన్నారు. రాశుల మీద ఉన్న ధాన్యాన్ని సురక్షితంగా టార్పాలిన్లు కప్పి భద్రపర్చుకోవాలని, ప్రతి రైతుసేవా కేంద్రంలో టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచామని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, రెండు గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులు ధైర్యంగా ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

హెచ్‌ఐవి బాధితులు కుంగుబాటుకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో సహపంక్తి అల్పాహారాన్ని హెచ్‌ఐవి బాధిత పిల్లలకు, ట్రాన్స్‌జెండర్లకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులు ఎటువంటి వివక్షకూ గురికాకుండా ప్రభుత్వ చట్టాలున్నాయన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లాలో ఎయిడ్స్ కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్, రంగోలి పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం పాజిటివ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ జె.శివకృష్ణ హెచ్‌ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కిషోర్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ బాలాజీ, స్వచ్ఛంద సంస్థలు, మొబైల్ ఐసిటిసి సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కలవరం.. కలకలం..!

ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రభుత్వం కొలువుదీరి సుమారు ఆరు నెలలవుతోంది. ఎన్నికల్లో జిల్లాలో ఘోర ఓటమి చవిచూసిన ప్రతిపక్ష వైసిపి ఇంకా ఆ ఓటమి నుంచి బయటపడకపోగా ప్రజాప్రతినిధులు, నేతలు ఒకొక్కరూ జారిపోతుండటం ఆ పార్టీ శ్రేణులను కలవరపరుస్తోంది. మరోపక్క అధికార పక్షమైన కూటమిలోనూ వివిధ అంశాల్లో టిడిపి, జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండగా టిడిపిలో సీనియర్, జూనియర్ నేతల మధ్య ఆంతరంగిక పోరు రోడ్డున పడటం, టిడిపి, జనసేన పోటాపోటీగా ప్రధాన నామినేటెడ్ పదవులు పశ్చిమకే కేటాయించి ఏలూరు జిల్లాకు మొండిచెయ్యి చూపడం ఇరు పార్టీల్లోనూ కలకలం సృష్టిస్తోంది.

ప్రతిపక్ష వైసిపికి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ గుడ్‌బై చెప్పారు. టిడిపి నుంచి వైసిపి గూటికి చేరిన వెంటనే ఆయనకు ఎంఎల్‌ఎ కోటాలో ఎంఎల్‌సి పదవి దక్కింది. దీంతో కొల్లేరు ప్రాంతంలో మరోసారి విజయకేతనం ఎగురవేయొచ్చని వైసిపి భావించింది. అయితే దానికి భిన్నంగా కూటమి జోరులో వైసిపి ఉమ్మడి జిల్లాలోనే పత్తా లేకుండాపోయింది. ఈ క్రమంలో మాజీ మంత్రి ఆళ్ల నాని వైసిపిని వీడగా ఆపై ఏలూరు మేయర్, కార్పొరేటర్లు, జెడ్‌పి ఛైర్మన్ తదితరులు వైసిపిని వీడారు. తాజాగా జయమంగళ రాజీనామాతో మరోసారి ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైంది. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎలు ముదునూరి ప్రసాద్‌రాజు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దూలం నాగేశ్వరరావు తప్ప ఆ పార్టీ మాజీ ఎంఎల్‌ఎలు, నేతలు ఎవరూ పెద్దగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. పైగా ఎంఎల్‌సిలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సైతం అప్పుడప్పుడూ ప్రత్యక్షం కావడం మినహా బహిరంగ కార్యక్రమాల్లో పెద్దగా కన్పించడం లేదు. ఇక భీమవరం మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఇప్పటికే పార్టీని వీడేందుకు సిద్ధం కావడం, ఆ పార్టీ మాజీ మంత్రులు రంగంలోకి దిగి బుజ్జగించిన సంగతి తెలిసిందే. ఏదేమైనా మాజీ ఎంఎల్‌ఎలు, ముఖ్య నేతలు సైతం పార్టీని వీడుతుండటంతోపాటు ఉన్న వారు సైతం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా లేకపోవడం ఆ పార్టీ కేడర్‌లో ఆందోళన రేకెత్తిస్తోంది. జగన్ సంక్రాంతి తర్వాత చేపడతారని చెబుతున్న జిల్లావారీ సమీక్షల నాటికి ఇంకెంత మంది పార్టీని వీడతారోననే కలవరం ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది.

ఇక అధికార పక్షమైన కూటమిలోని టిడిపి, జనసేనల్లోనూ ఆధిపత్య పోరుతోపాటు అంతర్గత కుమ్ములాటలు పెరుగుతున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికి నిదర్శనం నూజివీడు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితే. టిడిపి, జనసేన నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల సమక్షంలో బయటపడిన సంగతి తెలిసిందే. తర్వాత పరిస్థితుల్లో పెద్దగా మార్పులేమీ చోటుచేసుకోలేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అదే సమయంలో నామినేటెడ్ పదవుల కోసం టిడిపిలో ఆంతరంగిక పోరు నెలకొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. నూజివీడులో మాజీ ఎంఎల్‌ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు తదితరులు ఏలూరు జిల్లాలో పదవులు ఆశిస్తున్న నేతల్లో ముఖ్యులుగా ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ నామినేటెడ్ పదవులు ఎక్కువ కట్టబెట్టినా ఇంకా ఆ పదవుల కోసం క్యూలో ఉన్న వారి సంఖ్య పెద్దగానే ఉంది. అయితే నరసాపురంలో మహ్మద్ షరీఫ్‌కు క్యాబినెట్ ర్యాంకు పదవి, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుకు, మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకు డిప్యూటీ స్పీకర్, ఎపిఐఐసి ఛైర్మన్ పదవులు దక్కగా, జనసేన తరపున భీమవరం ఎంఎల్‌ఎ అంజిబాబుకు పిఎసి ఛైర్మన్‌గా క్యాబినెట్ ర్యాంకు పదవి, అక్కడే వేగేశ్న కనకరాజు సూరికి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి, విప్‌లుగా నరసాపురం, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎలు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్‌లకు పదవులు దక్కాయి. ఒకవిధంగా చెప్పాలంటే జనసేనకు చెందిన ముగ్గురు ఎంఎల్‌ఎలకు ఏదోక పదవి దక్కింది. ఇక టిడిపిలోనైతే ఆచంట, తణుకు ఎంఎల్‌ఎలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణలకు ఎటువంటి ప్రత్యేక గుర్తింపూ దక్కలేదు. మంత్రి పదవి దక్కకపోవడంపై ఇప్పటికే పితాని అనుచరుల్లో అసంతృప్తి ఉందనడంలో ఎటువంటి సందేహమూలేదు. అలాగే మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మెంటే పార్థసారథి, వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) తదితరులు పదవులు ఆశిస్తున్న జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలోనే నూజివీడులో టిడిపి నేతల నడుమ విభేదాలు రోడ్డుకెక్కడం అందరినీ విస్మయపరుస్తోంది. ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపి గూటికి చేరి ఇక్కడ నుంచి పోటీ చేసి గెలుపొందిన కొలుసు పార్థసారథి రాష్ట్ర మంత్రి పదవి సైతం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తిరుగుబావుటా ఎగురవేసిన ముద్రబోయిన వెంకటేశ్వరరావును బుజ్జగించి ఎన్నికల తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని అధిష్టానం హామీ ఇచ్చింది. అయితే నామినేటెడ్ పదవుల జాబితాలు వరుసగా వెలువడినా ముద్రబోయినకు చోటుదక్కలేదు. ఈ క్రమంలో ఆ నియోజకవర్గంలోని ముఖ్యనేత కాపా శ్రీనివాసరావు ముద్రబోయిన పార్టీకి నష్టం కల్గిస్తున్నారని, ఆయనను పార్టీ నుంచి బహిష్కరించాలని బహిరంగంగా డిమాండ్ చేయడం కలకలం సృష్టించింది. పోలవరం నియోజకవర్గంలోనూ టిడిపిలో బొరగం, మొడియం గ్రూపుల మధ్య విబేధాలు ఇప్పటికీ వీడకపోవడం అక్కడి పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తోంది. బొరగం శ్రీనివాసరావుకు నామినేటెడ్ పదవి దక్కడంతో గ్రూపు విబేధాలు సమసిపోతాయని అంతా భావించినా చాపకింద నీరులా పార్టీ శ్రేణులు రెండుగా చీలిపోయారని తెలుస్తోంది. ఏదేమైనా వరుస రాజీనామాలతో వైసిపి ఉక్కిరిబిక్కిరవుతుండగా.. తానేమీ తీసిపోనట్లు ఒకపక్క జనసేన, టిడిపి మధ్య ఆధిపత్య పోరు, మరోపక్క నేతల విబేధాలతో టిడిపి కూటమిలోనూ కలకలం నెలకొందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.



-వియస్ఎస్‌వి.ప్రసాద్

సుబ్బారెడ్డి మరణానికి సంతాపం

ప్రజాశక్తి - భీమవరం

ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మరణం చాలా బాధాకరమని, ప్రజానాట్యమండలి రాష్ట్ర సాంస్కృతిక ఉద్యమం ఉత్తమ నటుడు, ప్రతిభావంతమైన దర్శకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఈలోటు పూడ్చలేనిదని, దీర్ఘకాలంగా ప్రజా నాట్యమండలిలో ప్రజా కళాకారుడుగా సేవలు అందించిన సుబ్బారెడ్డికి జోహార్లు అర్పిస్తునట్లు పేర్కొన్నారు. ఆయన మరణానికి తీవ్ర సంతాపం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ప్రవల్లికకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన తైదుల శ్రీనివాసరావు సైదులు, ఇంద్ర కుమారి దంపతుల కుమార్తె సరస్వతి ప్రవల్లిక తమిళనాడు రాష్ట్రం తిరువూరులోని సెంట్రల్ యూనివర్సిటీలో బంగారు పతకం సాధించింది. గత నెల 30వ తేదీ శనివారం నిర్వహించిన స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్ జి.పద్మ బంగారు పతకాన్ని, ఎంఎ ఎకనామిక్స్ పట్టాను అందించారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి బంగారు పతకం సాధించిన సరస్వతి ప్రవల్లికకు జంగం సుధీర్, మానుకొండ మంగరాజు అభినందనలు తెలిపారు.



పతకం అందుకుంటున్న సరస్వతి ప్రవల్లిక


శిక్షకురాలిని సత్కరిస్తున్న సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమడోలు

మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరగడానికి సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు విజయవంతమవుతున్నాయని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు శశిశేఖర్ అన్నారు. భీమడోలు కేంద్రంగా శ్రీ సత్యసాయి సేవాసమితి భీమడోలు శాఖ ఆధ్వర్యంలో బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ, హైదరాబాదు (బ్రిడ్)కు చెందిన సహాయ డైరెక్టర్ జి.రామారావు పర్యవేక్షణలో, శిక్షకురాలిగా వ్యవహరించిన అనూష సహాయ సహకారాలతో 37 రోజుల పాటు మహిళా యువతకు నిర్వహించిన మగ్గం, జిర్దోని వస్తువుల తయారీలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. 82 మంది మహిళా యువత శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీరికి సర్టిఫికెట్లను అతిథుల చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా సత్యసాయి సంస్థల రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం సమన్వయకర్త నాగప్రసాద్, స్థానిక ప్రతినిధి సత్యసాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, పంచాయతీ కార్యదర్శి తనూజ, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు ప్రస్తుతం శిక్షణ పొందిన వారికి వారు సొంతంగా యూనిట్లు స్థాపించేందుకు రుణాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల ఏలూరు జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ మనోజ్‌కు బెస్ట్ ఫాదర్ అవార్డు

ప్రజాశక్తి -ముదినేపల్లి



అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ బెస్ట్ ఫాదర్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. హైదరాబాదు విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామదేను అవార్డు కింద ప్రతి ఏటా ఇచ్చే బెస్ట్ ఫాదర్ అవార్డును ఈ ఏడాది ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు మనోజ్‌ను ఎంపిక చేసింది. ఈ అవార్డును ఈ నెల ఎనిమిదో తేదీన హైదరాబాదులో జరగనున్న కార్యక్రమంలో అందించి మనోజ్‌ను సత్కరించనున్నట్లు ఆ సంస్థ సిఇఒ సత్యవోలు రాంబాబు తెలిపారు. డాక్టర్ అంబుల మనోజ్‌కు బెస్ట్ ఫాదర్ అవార్డు 2024వ సంవత్సరానికి గాను ఇస్తున్నందుకు ముదినేపల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో కూనవరం లొద్ది

సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండల ఏజెన్సీలో కూనవరం లొద్ది అనే వలస ఆదివాసీ గిరిజన గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. లొద్దిలో ఆదివారం శాఖా కార్యదర్శి మడకం ఉంగ అధ్యక్షతన శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ లొద్దిలో ఎటువంటి మౌలిక సౌకర్యాలు లేక ఇక్కడి ఆదివాసీలు దుర్భర పరిస్థితుల్లో బతుకులు నెట్టుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి, తాగునీటి వంటి సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. మినీ అంగన్వాడీ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు దృష్టి సారించి కూనవరం లొద్దిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, మడివి జోగేష్, రవ్వా అర్జున్, బాబూరావు, మంగ పాల్గొన్నారు.

నెల రోజుల్లో 52 కేసులు నమోదు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభుకుమార్, జిల్లా అధికారి ఆవులయ్య ఆదేశాల మేరకు గత నవంబర్ నెలలో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో మొత్తం 52 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో 25 నాటు సారా కేసులు ఉండగా 17 మంది నిందితులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి 87 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకునినట్లు తెలిపారు. 12,810 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 22 బెల్ట్‌షాప్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 331 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 31 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కల్లులో కల్తీ జరగకుండా ఉండేందుకు రెండు కల్లు శాంపిల్స్ తీసుకున్నట్లు తెలిపారు. 40 మంది పాత నిందితులను ఒక సంవత్సర కాల పరిమితితో నాలుగు మండలాల తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఈ సంవత్సర కాల పరిమితిలో వీరు మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ప్రభుత్వం అందించే పథకాలను రద్దు పరుస్తారని తెలిపారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాన్ని సుంకొల్లు, వేల్పుచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో చేసిన దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. కలవకొల్లు రెడ్డియ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చాట్రాయి మండలంలోని చిన్నంపేట, అగిరిపల్లిలో కల్లు శాంపిల్స్ తీసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


ప్రియాంక (ఫైల్‌ఫొటో)

బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన ఏలూరు నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రెండో పట్టణ ఎస్ఐ నాగకళ్యాణ్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని ఆర్ఆర్.పేట ప్రాంతానికి చెందిన కాళీ ప్రియాంక (25) బ్యూటీషియన్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త శ్రీకాంత్ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున భార్యాభర్తల మధ్య చిన్నపాటి విభేదం తలెత్తింది. శ్రీకాంత్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ప్రియాంక ఇంట్లో ఫ్యానుకు చున్నితో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఇది గమనించిన అతను వెంటనే ప్రియాంక తల్లిదండ్రులకు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు దర్యాప్తు వేగవంతం

ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. భర్తే ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడా లేదా ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసును ఎస్ఐ నాగ కళ్యాణ్ ఏలూరు రెండో పట్టణ సిఐ రమణ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారీ

ఆదర్శంగా నిలుస్తున్న వాడవల్లి గ్రామ పంచాయతీ



ప్రజాశక్తి - ముదినేపల్లి

రసాయన ఎరువులతో సాగు చేసే భూములు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయని, రసాయనాలకు బదులు వర్మీ కంపోస్టు ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంట్లోని చెత్త, కుళ్లిన కూరగాయలు పశువుల పేడ కాదేదీ సంపదకు అనర్హమంటుంది ఓ పంచాయతీ. వ్యర్థాలను ఆదాయ వనరుగా మార్చే ప్రక్రియను పక్కాగా అమలు చేయడంతోపాటు సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయాలు ప్రారంభించింది. చిన్న చిన్న అవసరాలకు ప్రభుత్వం వైపు చూడకుండా ఉన్న వనరులతో సంపద సృష్టించుకోవటం ద్వారా ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది మండలంలోని వాడవల్లి గ్రామ పంచాయతీ. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా సేంద్రియ ఎరువు వాడకం పట్ల రైతులకు అవగాహన కల్పిస్తోంది. మండలంలోని వాడవల్లి గ్రామ పంచాయతీ వర్మీ కంపోస్ట్ షెడ్డు నిర్మించింది. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తుంది. సేకరించిన వ్యర్థాలను వేరు చేసి, పశువుల పేడ, వానపాముల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. తయారైన వర్మీకంపోస్ట్‌ను బస్తాల్లోకి నింపి రైతులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టిస్తూ పంచాయతీకి ఆదాయ మార్గాలు పెంచుకుంటున్నారు.


వర్మీ కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ మల్లీశ్వరి

అత్యుత్తమ సేంద్రియ ఎరువు వర్మీ కంపోస్టు

ఎం.పవన్‌కుమార్, వాడవల్లి గ్రామ కార్యదర్శి



ఒకప్పుడు భూమిలో సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండేది. వానపాముల సంచారం అధికంగా కనిపించేది. దీంతో నేల సారవంతమయ్యేది. రసాయన ఎరువుల మితిమీరిన వాడకం వల్ల మట్టికి ఆ ప్రయోజనాలు దూరమయ్యాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడతో వర్మీ కంపోస్టు తయారు చేసి పంటలకు అందిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చు.

ఎయిడ్స్ భూతం.. అవగాహనతోనే అంతం

ఎయిడ్స్ డే సందర్భంగా పలుచోట్ల అవగాహనా కార్యక్రమాలు



నూజివీడులో...


ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్‌తో మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, ఆ వ్యాధిగ్రస్తులను దూరంగా ఉంచాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేంద్రసింగ్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు అవసరమైన మందులు ఉచితంగా అందించడంతో పాటు గర్భిణులకు వ్యాధి ఉంటే వారికి పుట్టే బిడ్డకు వ్యాధి సోకకుండా చూడగలిగే స్థాయికి వైద్య సేవలు చేరాయన్నారు. ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. మందులతో జబ్బును అదుపులో ఉంచుకోవడం కంటే నివారణ చాలా మేలని చెప్పారు.

భీమడోలు : భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వేదికగా ఐసిటిసి కౌన్సిలర్ సింహాద్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రష్మీ పాల్గొన్నారు. కాలేజీ బాలికల వసతి గృహం సంరక్షకురాలు సాయి గౌరీ ఆధ్వర్యంలో వసతి గృహానికి చెందిన బాలికలు కార్యక్రమ నిర్వహణకు తమ వంతు సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ రష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యక్రమ నినాదం నా ఆరోగ్యం నా హక్కు అంశం గురించి వివరించారు. ఎయిడ్స్ పట్ల ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎయిడ్స్ నిరోధానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వ పరంగా అందుతున్న వైద్య, ఇతర సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ సింహాద్రి మాట్లాడుతూ భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటీవల కాలంలో ఎయిడ్స్ అవమానిత రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. దీనికి ప్రధాన కారణం ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి తెలియకపోవడమన్నారు. వీరందరికీ ఐసిటిసి పరంగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ప్రముఖుల భాగస్వామ్యంతో భీమడోలు పురవీధుల్లో ర్యాలీ కొనసాగింది. విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన సీనియర్ స్టాఫ్ నర్స్ స్వర్ణ పాల్గొన్నారు.


సేవా కార్యక్రమాల్లో ముందుంటా

టిడిపి నాయకులు పాకనాటి సీతారామ్


బోరు వేయిస్తున్న పాకనాటి సీతారామ్

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు గ్రామానికి చెందిన పాకనాటి సీతారామ్ ఆపన్నులను ఆదుకునే వ్యక్తి అని, పేదవారికి సాయం చేసే మనిషి అని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆయన పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని కొనియాడుతున్నారు. ఒక పక్క వేరే రాష్ట్రంలో ఉద్యోగం చేస్తూ ఆ వచ్చిన జీతంలో కొంతభాగం పేదవారికి సాయం చేసే మంచి మనిషి అని చెబుతున్నారు. పుట్టిన గ్రామం ముసునూరుతో పాటు మండలవ్యాప్తంగా సాయం చేసే వ్యక్తి సీతారామ్ అని గ్రామస్తులు ఆయనను అభినందిస్తున్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని పాకనాటి పెద్దలక్ష్మయ్య 1983లో తెలుగుదేశం జెండా సైకిల్‌కి, తాను ఉంటున్న ఇంటికి కట్టుకుని అందరికీ సహాయం చేస్తూ అందరి మన్ననలు పొందారని గ్రామంలో పెద్దలు చెబుతున్నారు. టిడిపి అంటే పెద్దలక్ష్మయ్య,పెద్దలక్ష్మయ్య అంటే టిడిపి అనే లెక్కలో బతికిన ఆయన కుమారుడు పాకనాటి వెంకట సుబ్బారావు, రంగమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు పాకనాటి సీతారామ్. ఆయన కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ఎంబిఎ పూర్తి చేసి తెలంగాణా రాష్ట్రంలోని ప్రముఖ బహుళ జాతి కంపెనీలో 13 ఏళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నారు. తాను పుట్టిన గ్రామానికి ఎంతో కొంత సహాయం చేయలనే సంకల్పంతో నూజివీడు మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ముసునూరు, మండల పరిసర ప్రాంతాల్లో పలువురికి సాయం చేశారు. ఈ సందర్భంగా సీతారామ్ ప్రజాశక్తితో మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన వయో వృద్ధులకు, వికలాంగులకు సాయం చేసినట్లు తెలిపారు. తాను చదివిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రతి పుట్టిన రోజున రూ.25 వేలతో కలర్ ప్రింటర్ అందించినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష రాసే ప్యాడ్‌లు, నోటు పుస్తకాలు, పెన్నులు అందించినట్లు తెలిపారు. యాదవ సామాజిక తరగతిలో పుట్టినప్పటికి కుల, మత బేధాలు లేకుండా ప్రతి ఏడాది డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండుగు పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలకు కేకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ముసునూరు గ్రామంలోని సాగరల శ్మశనవాటికిలో స్నానం ఆచరించేందుకు నీరు లేక గత కొన్నేళ్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఈ సమస్యను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి ఈ ఏడాది మార్చి నెలలో రూ.లక్షతో బోరు వేయించినట్లు తెలిపారు. కరెంటుతో పని లేకుండా అందరికీ తాగునీటి పంపు వలే చేతి పంపు బిగించినట్లు చెప్పారు. ముసునూరు గ్రామంలో వృద్ధులు, వికలాంగులు సేద తీర్చుకునేందుకు రూ.25 వేలతో పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద, ప్రధాన సెంటర్ కూడళ్లలో బెంచీ బల్లలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు వరద భాధితుల సహాయం కోసం రెండు వేల మందికి తన సొంత ఖర్చుతో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలోని 16 గ్రామాల్లో టిడిపి కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తూ అందరి మన్ననలను పొందిన వ్యక్తి మన పాకనాటి సీతారామాంజనేయులు అని గ్రామస్తులు అభినందిస్తున్నారు. చదువులో ముందుండే విద్యార్థులు సహాయం కోరి వస్తే వారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, పేద, బడుగు, బలహీన తరగతుల ప్రజలకు అనారోగ్య సమస్యలైనా, ఏ సమస్యలైనా తాను సహాయం చేయడానికి ముందుంటానని సీతారామ్ తెలిపారు.


గర్భిణికి సాయం చేస్తున్న సీతారామ్

స్టెత్‌స్కోప్ వదిలి.. లాఠీ పట్టుకుని..!

నాన్న స్ఫూర్తితో పోలీసు ఉద్యోగానికి ప్రయత్నం

తొలి ప్రయత్నంలోనే విజయం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద హెచ్చరించారు. 2022 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారిని ఈమె. నరసాపురం డిఎస్‌పిగా పనిచేస్తున్న రెండో మహిళా డిఎస్‌పి కావడం విశేషం. పోలీస్ శాఖలో పనిచేయాలనే లక్ష్యంతో డాక్టర్‌గా పనిచేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. ఈమె మొదటి పోస్టింగ్ నరసాపురం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఈమె శనివారం ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న : మీ సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని స్టేషన్స్ ఉన్నాయి? ఎంత మంది అధికారులు ఉన్నారు?

డిఎస్‌పి : సబ్ డివిజన్‌లో మొత్తం 10 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఐదుగురు సిఐలు, 13 మంది ఎస్ఐలు ఉన్నారు.

ప్రశ్న : ఇటీవల కాలంలో సబ్ డివిజన్‌లో దొంగతనాలు పెరిగాయి, దొంగతనాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసాము. గతంలో నమోదైన కేసులపై ఇప్పటికే దృష్టి పెట్టాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైతం దొంగలను పట్టుకుంటాం. ప్రభుత్వం, దాతల సహకారంతో గ్రామాల్లో, సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై నిఘా పెట్టాం. ఇప్పటికే సబ్ డివిజన్‌లోని క్రైమ్ పార్టీ సిబ్బందితో రివ్యూ మీటింగ్ సైతం ఏర్పాటు చేశాం. 24 గంటలూ గ్రామాల్లో బీట్లు ఏర్పాటు చేసాం.

ప్రశ్న : విద్యార్థులకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా?

డిఎస్‌పి : విద్యార్థులు ఎవరూ ప్రేమ పేరుతో మోసపోవద్దు. తల్లిదండ్రులను ఎవరూ బాధ పెట్టవద్దు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా ధైర్యంగా తమకు ఫిర్యాదు చేయండి, చర్యలు తీసుకుంటాం. పరీక్షలు దగ్గర పడుతున్నాయి కావున బాగా శ్రద్ధ పెట్టి చదువుకోండి. సమయాన్ని వృథా చేసుకోవద్దు.



డిఎస్‌పి శ్రీవేద

చిట్ చాట్

ప్రశ్న : యువతకు మీరు ఇచ్చే సూచన ఏంటి?

డిఎస్‌పి : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి. నేటి తరంలో పోటీతత్వం పెరిగింది. కావున పరీక్షలకు పక్కాగా ప్రణాళిక రచించి, ఉద్యోగాలు సాధించుకోవాలి. ఎవరూ కూడా కేసుల్లో చిక్కుకోవద్దు. చెడు వ్యసనాలకు బానిసై, బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ఫోన్లకు దూరంగా ఉండి, పుస్తకాలకు దగ్గర అవ్వండి.

ప్రశ్న : ఫోక్సో కేసుల సంఖ్య పెరుగుతున్నాయి, నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : కళాశాల, పాఠశాల వద్ద పోలీస్ నిఘా పెడుతున్నాము. ప్రేమ పేరుతో ఎవరూ మోసపోవద్దు. మహిళా ఎస్ఐలతో ఇప్పటికే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాము. గుడ్ టచ్-బాడ్ టచ్‌పై తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలి. పోలీసులతో పాటు తల్లిదండ్రులు పిల్లలు ఏమి చేస్తున్నారు? ఎవరితో ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారు? అనేవి ఆరా తీయాలి. లైంగిక వేధింపులు ఎదుర్కొంటే ధైర్యంగా ఫిర్యాదు చేయండి. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నిరోధానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : రోడ్డు ప్రమాదంలో జరిగే ప్రదేశాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ ఉండే ప్రదేశాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తాం. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపవద్దు. ప్రధాన సెంటర్లో రోడ్ల ఆక్రమణకు గురైతే ఇతర అధికారులతో కలిసి ఆక్రమణలు తొలగిస్తాం.

ప్రశ్న : సబ్ డివిజన్లో కోడిపందేలు, పేకాట ఎక్కువగా జరుగుతున్నాయి, వీటి నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : కోడిపందేలు, పేకాటలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఎక్కడన్నా కోడిపందేలు, పేకాట జరిగితే 100కు సమాచారం అందించండి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. ఇప్పటికే కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నాము. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగించినా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : ఎక్కువగా సబ్ డివిజన్‌లో ఏ కేసులు నమోదవుతున్నాయి?

డిఎస్‌పి : సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో తనిఖీ చేస్తున్నాను. ఒక్కొక్కచోట ఒక్కొక్క కేసులు నమోదు అవుతున్నాయి. ఎక్కువగా భార్యాభర్తల గొడవలు, ఆత్మహత్యలు, సైబర్ నేరాలు, కొట్లాట, చీటింగ్ కేసులు నమోదు అవుతున్నాయి.

ప్రశ్న : సైబర్ నేరాల నివారణకు చర్యలు ఏమి తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు, వెబ్‌సైట్లకు వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని, అన్ని అకౌంట్లకు విభిన్నమైన, స్ట్రాంగ్ పాస్వర్డ్స్ ఉపయోగించాలన్నారు. అనుమానితమైన ఏదైనా విషయం గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు.

ప్రశ్న : డాక్టర్ నుంచి పోలీస్ ఉద్యోగానికి ఎందుకు వచ్చారు, మీకు స్ఫూర్తి ఎవరు?

డిఎస్‌పి : డాక్టర్ అంటే కొన్ని ఏరియాలో కొంత సమయం మాత్రమే సేవ చేస్తాము. పోలీసు అయితే రాష్ట్రమంతా సేవలు చేయవచ్చు. డాక్టర్‌గా పనిచేస్తూ పోలీసు ఉద్యోగానికి ప్రయత్నించాను. నాన్న రిటైర్డ్ ఐజీగా పనిచేశారు. నాన్నను స్ఫూర్తిగా తీసుకొని పోలీస్ ఉద్యోగం సాధించాను.

సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు కేంద్రంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం పులదాసు రమేష్ అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మండల కేంద్రానికి నిరంతరం ప్రజలు అధికారులను కలవడానికి, అదేవిధంగా వారి వ్యక్తిగత పనులు, వ్యాపారాలు, బ్యాంకులు పనుల రీత్యా కుక్కునూరు వస్తూ ఉంటారన్నారు. ఒక చిన్న అప్లికేషన కావాలన్నా కుక్కునూరు రావాల్సిందేనన్నారు. ఈ తరుణంలో గంటల తరబడి సమయం కేటాయించి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండల కేంద్రంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని గత ఐదేళ్ల నుంచి పలుమార్లు అధికారులకు సిపిఎం విన్నవించుకున్నా ఇప్పటి వరకు ఎవరూ స్పందిం చలేదన్నారు. ఇప్పటికే ముంపు పేరుతో మండలాన్ని అభి వృద్ధికి నోచుకోకుండా ప్రభుత్వాలు వ్యవహరి స్తున్నా యన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలని, కుక్కునూరు లోపల ఉన్న బస్టాండ్‌కి ప్రతి ఒక్క బస్సు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గతంలో అన్ని సర్వీసులు బస్టాండ్‌కి వెళ్లేవని, ఇప్పుడు వెళ్లకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం ఉపాధి కూలీలకు వెంటనే పనులు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి డిమాండ్ చేశారు. మండలంలోని ఎఎస్ఆర్.నగర్‌లో ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ నాయకులు గూడెల్లి వెంకట్రావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఏడాదికి పైగా మండలంలోని అప్పలరాజుగూడెం ఉపాధి కూలీలకు అధికారులు పనులు కల్పించడం లేదన్నారు. పనులు కల్పించాలని పలుమార్లు కూలీలు అధికారులను అడిగినప్పటికీ పనులు చూపటానికి జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని అడిగిన వెంటనే పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ఇదే తరహాలో పనులు లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పని కావాల్సిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కూలీలతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కూలీల పెండింగ్ వేతనాలు కూడా ఎప్పటికప్పుడు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి త్వరగా ఉపాధి హామీ పనులు చూపాలని డిమాండ్ చేశారు. పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. పే స్లిప్పులు ఇవ్వాలని, అవినీతి లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, అనుమోలు మురళి, పూసం సూర్యారావు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన

ద్వారకతిరుమల :ద్వారకాతిరుమల శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపం వద్ద కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మాజీ మంత్రి తానేటి వనిత, జనసేన గోపాలపురం ఇన్‌ఛార్జి దొడ్డిగొర్ల సువర్ణరాజు హాజరయ్యారు. బిజెపి స్థానిక నాయకులు వాసు, మొగతడకల శ్రీనివాసరావు, ఇమ్మడి రత్నాజీ, ఇమ్మడి నాగు, పెద్ద రెడ్డి నాగేశ్వరరావు, అంబటి గాంధీ, చిలుకూరి ధర్మలు, తరగతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి జ్యోతి, చిలుకూరు నాగ సుబ్రహ్మణ్యం తదితర కాపు సంఘం నాయకులు, కాపు మహిళలు, పుర ప్రముఖులు కార్తీక సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అతిథులకు ద్వారకాతిరుమల కాపు సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.